— క థా ని క —

# వెన్నెలరాత్రి

కొమ్మూరి వేణుగోపాలరావు

ఆ రోజు పౌర్ణమి. రాత్రి ఎనిమిదిన్నర అవుతుంది. నేనూ, ఉషా, సుధా, బాబూ డాబా మీద వెన్నెల్లో కూచుని కబుర్లు చెప్పుకుంటున్నాం.

బాబుకి కథల పిచ్చి ఎక్కువ. "నాన్నా కథ చెప్పవూ?" అని అడిగాడు.

"ఇప్పుడు కథలేమిటిరా. వేళాపాళా లేకుండా" అన్నది వాడికన్నా పెద్దదైన సుధ. నిజంగా కబుర్ల సరదాలో మైమరచింది సుధ.

"నాకు కథే కావాలి." అన్నాడు బాబు మారాం చేస్తూ.

చెప్పకపోతే ఏడుస్తాడని తెలుసు. చెప్పటానికేమో అంత ఉత్సాహం కలగటంలేదు

"ఇప్పుడొద్దులేరా బాబూ. ఎప్పుడూ ఉన్న కథలేగా. తర్వాత ఎప్పుడయినా చెప్పుకోవచ్చు" అని సముదాయించబోయాను వాడిని.

వాడేడుపు మొహం పెట్టాడు, అది చూసి ఉష, "చెప్పండి పోనీ" అని వాడి తరఫున సహాయం వచ్చింది.

"నువ్వు చెప్పకూడదూ, పురమాయించకపోతే" అన్నాను కొంచెం విసుగ్గా.

"అమ్మ వద్దు నాన్నా నువ్వే చెప్పు" అన్నాడు బాబు పోజు మార్చుకుని. సుధ కొంచం విసుక్కున్నట్లుగా కనబడ్డది.

సరే. ఇంక ఎలాగూ తప్పేటట్లు లేదనుకొని ఏం కథ చెప్పనూ అని ఆలోచన మొదలుపెట్టా. కథలంటూ నాకేవీరావు. పిల్లల్ని మభ్యపెట్టటం కోసం అప్పటికప్పుడు కల్పించి, ప్రయాసపడి ఎలాగో కథరూపం తెచ్చి వాళ్ళకు చెప్పడం అలవాటు. ఇవేళ కూడా అలానే చేద్దామనుకున్నా గాని చటుక్కున ఒక విషయం గుర్తుకు వచ్చింది.

"సరే అయితే చెప్తున్నాను. నువ్వు కూడా విను శ్రద్ధగా" అని ఉషకు చెప్పి ఆరంభించాను.

"ఇదిగో బాబూ, సుధా జాగర్తగా వినండమ్మా. ఇదేమీ కల్పనా కథ కాదు. కొన్ని ఏళ్ల క్రితం యథార్థంగా జరిగిందేను." అంటూ ఉష ముఖం వంక చూశాను. కథ వినాలనే ఆశక్తి ఆవిడ ముఖంలో కూడా గోచరించింది.

"ఎనిమిదేళ్ల క్రితం విషయం. ఒక వూళ్ళో ఒక కాలేజీ వుంది. అందులో చాలామంది అమ్మాయిలూ, అబ్బాయిలూ చదువుకుంటూన్నారు. మనకి అందరి విషయమూ వద్దులే. అందులో ఒకమ్మాయిని గురించి, ఒకబ్బాయిని గురించి చెప్తాను" అని అంటూండేసరికి—

"ఇలాంటి కథలొద్దు నాన్నా. అనగనగా లాంటివి కావాలి" అన్నాడు బాబు.

"ఇదికూడా అలాంటిదేనమ్మా. కొంచెం ఓపిక చేసుకుని విను. కాలేజీలో చదువుతున్న ఆ అమ్మాయీ, అబ్బాయీను యిరుగు పొరుగు ఇళ్లలోనె వుండేవారు. అయినా వాళ్ళకు స్నేహం అంటూ ఏమీలేదు. ఊరికినే అలా ఉండేవారు."

"వాళ్ళ పేర్లేమిటి నాన్నా?" అని అడిగింది సుధ మధ్యలో ఆపి.

"పేర్లా. అవేమిటోవుండేవమ్మా. అదో గమ్మత్తుగా... సరే ఏమయితేనేమిగాని ఆ అమ్మాయిని అమ్మాయని, అబ్బాయిని అబ్బాయని పిలుద్దాము. సరే, వాళ్ళు రోజూ కాలేజీలో ఒకళ్ళనొకళ్ళు దొంగ చూపులు చూచుకుంటూ వుండేవారు. ఆ అమ్మాయికీ మనస్సులో ఏముండేదో గాని, అబ్బాయికి మాత్రం ఆమెతో మాట్లాడాలని కుతూహలంగా ఉండేది.

ఉష వంక చూడకుండానే చెప్పుకు పోతున్నాను. కాని యింతలో ఆవిడ రక్కున ఆపి, బాగానేవుంది పిల్లలకి యిటువంటివేనా చెప్పవలసిన కథలు?" అని కొంచం నిష్ఠూరంగా మాట్లాడింది.

నేను వెంటనే అందుకుని "తప్పేముంది గనక. రాజకుమారీ, రాజకుమారుడూ కథలు చెప్పటం లేదూ? యివ్వీ అంతేనూ" అని సమాధానం చెప్పి తిరిగి కథ చెప్పసాగాను.

"సరే. ఆ అబ్బాయికి మనస్సులో మాట్లాడాలన్న కోర్కె రోజురోజుకీ పెరిగిపోయింది. అయినా మాట్లాడితే ఏమవుతుందోనన్న భయం. అందుకని వూరికినే చూపులు చూడటంతోనే సంతృప్తిపడసాగాడు. రోజూ సాయంత్రం కాగానే డాబామీదికి చేరేవాడు. ఆ అమ్మాయి కనిపిస్తుందేమోనని పడిగాపులు గాసేవాడు. నూటికోకోటికో అతని కోరిక ఫలించేది."

"ఆ అమ్మాయిని అతను ప్రేమించాడా నాన్నా" అనడిగింది చటుక్కున సుధ. దాని వయస్సు ఏడు సంవత్సరాలు.

"అవునమ్మా. అతను అలానే అనుకునేవాడు. ఆ అమ్మాయిని ఒక రోజు చూడకపోతే అతని మనసు నిలిచేది కాదు. కళ్లు కాయలు కాసేటట్లు కాపలా కాసేవాడు."

"నాన్నా! మరి ప్రేమ అంటే ఏమిటి?" అనడిగాడు బాబు.

నేను యీ ప్రశ్న విని ఉషవంక చూశాను. ఆవిడకు నవ్వు వచ్చినట్లున్నది యిది విని.

"వాడి ప్రశ్నకు సమాధానంట చెప్పండి- లేకపోతే అర్థంలేని విషయాలన్ని వాళ్లకు చెప్పటమేమిటి" అన్న దావిడ.

నేను ఏమని చెపుదామా అని తటపటాయిస్తున్నాను. సుధ చటుక్కున అందుకుని "తెలియదట్రా. రాజకుమారీ. రాజకుమారుడునూ పాటలు పాడుకుంటూ వుంటారు? సినిమాల్లో చూడలా?" అన్నది తన తెలివిని కనబరుస్తూ.

బాబు తెలిసినట్లు తల వూపాడు. "ఆ అదేనమ్మా ప్రేమ అంటే. అతను తనగదిలో కూచుని పాటలు పాడుకుంటూ వుండేవాడు ఆ అమ్మాయి మీద. అయితే ఎంతకాలం వూరికనే ఆమెను తలుచుకుంటూ కాలం గడపటం? అందుకని ఆలోచించి ఒక రోజున ఏం చేశాడంటే..."

"ఆ అమ్మాయి అతన్ని ప్రేమించలేదా నాన్నా?"

"అదేనమ్మా సుధా. ఆ అబ్బాయికి సమస్య అయి కూర్చుంది. అది తెలుసుకోవట మేలాగూ అని ఆలోచించాడు. ఊరికినే తనవంక అప్పుడప్పుడూ చూసినంతమాత్రాన ప్రేమ వుందని భావించటం ఎలాగూ? చివరికి ఆలోచించి ఆలోచించి ఒక నిశ్చయానికి వచ్చాడు. అదేమిటంటే ముందు ఎలాగైనా ఆమె పరిచయం సంపాదించాలి. తరువాత మెల్లగా తన అభిలాష బయట పెట్టవచ్చు అనుకున్నాడు. అనుకుని ఆమెకో రోజున ఉత్తరం అందచేశాడు.

"ఆ ఉత్తరంలో ఏముంది నాన్నా?"

"మరి నా కంతవరకే వచ్చు కథ. తర్వాత మీ అమ్మను అడగండి" అన్నాను.

"అదేమిటి నాన్నా. నీకొచ్చిన కథ అమ్మకెలా వచ్చును?"

"వచ్చునే." పిల్లలకిఏమ యిందో తెలుసుకోవాలని ఆతృర్తా గా వున్నట్లుంది. "మిగిలింది పూర్తి చెయ్యి" అన్నాను ఆవిడవంక తిరిగి

"బాగానేవుంది. నాకేమొచ్చు? అది కూడా మీరే పూర్తిచెయ్యండి" అంది నవ్వును దాచుకుంటూ ఉష.

"నీకు వచ్చులేఅమ్మా-చెప్పవూ?" అనడిగాడు బాబు ప్రతిమాలుతున్న పోజుపెట్టి.

"సరే అయితే వినండి" అంటూ చెప్పసాగింది ఆవిడ" ఆ అమ్మాయి తన తమ్ముడిద్వారా ఉత్తరాన్ని అందుకుంది. అసలా అమ్మాయికి అబ్బాయిమీద కొంచం కోపంగా వుండేది. తన వంక ఎప్పుడూ అలా ఎందుకూ చూస్తాడు? అని విసుక్కునేది. ఎప్పుడన్నా అతన్ని పిలిచి గట్టిగా చివాట్లు వేద్దామనుకునేదిగాని అదేమిటో మళ్లీ జాలి పడి వూరుకుండేది. సరే. ఉత్తరం అందుకోగానే పరిపరివిధాల ఆలోచించింది. అతను ఎంత సాహసంచేశాడూ, అదేమయినా మర్యాదేనా అని కొంచంగా బాధపడ్డది."

"మరిఉత్తరాన్ని చదివిందా?" అనడిగిందిసుధ.

"అప్పుడు చదవాలంటే వీలుపడలేదు తీరికగా చదువుదామని ఒకచోట దాచింది. ఆసాయంత్రం గదిలో వంటరిగా కూచుకుని వెదికేటప్పటికి ఏదీ ఉత్తరం? ఎక్కడో పోయింది."

"పోయిందా?" అని ఆరాటంగా ప్రశ్నించాడు బాబు.

"ఉష చెప్పసాగింది. "అవును పోయింది. మరి సమాధానం రాయటం ఎలాగా? పోనీ

మాట్లాడకుండా వూరుకుందామా అనుకున్నది. అలా చేయలేక నాన్నతో చెప్పి నాలుగువాట్లు వేయిద్దామా అనుకున్నది మళ్ళీ, ఆ ఆలోచన కూడా నచ్చలేదు. ఎలాగయినా సమాధానం రాయాలనుకున్నది. అయితే అసలు ఉత్తరం లేనిదే జవాబు ఏమని రాస్తుంది. అందుచేతఅతను ఏమిరాసి వుంటాడా అని ఆలోచించింది. సరే చివ్వరికి యిలాగరాసి వుంటాడు అని ఒక నిశ్చయానికి వచ్చింది."

"ఏ నిశ్చయానికి?"

"ఏమనంటె అతను తనవంక రోజూ చూస్తోన్నాడు కదా. అందుకనితను ఎంతో గాఢంగా ప్రేమించాననీ, పెళ్లి చేసుకుందామనీ రాసి వుంటాడు" అని నిశ్చయించుకున్నది. అందుకని యిలాంటి ఉత్తరాలు యింకెప్పుడూరాయకుండా మంచి ఘాటుగా జవాబిద్దామని నాలుగుచివాట్లు వేస్తూ ఉత్తరం రాసింది. అయితే అది అందచేయాలంటె మళ్లీ ఏమనుకుంటాడో అని జాలి వేసింది. మరయితే ఏమనీ రాయటం, ఆ రాత్రంతే యీ విషయమే గట్టిగా ఆలోచించింది. చివ్వరికి అనుకోకుండానే ఆ అమ్మాయి ఆలోచనలు మారిపోయినాయి. మరునాడు పొద్దున్నే జవాబురాసి అతనికిఅందేటట్లుచేసింది."

"జవాబు ఏమని రాసింది?" అనడిగింది సుధ.

ఉష మాట్లాడలేదు. సరే నేనందుకున్నాను "నేను చెప్తాను వినండమ్మా. ఆ అబ్బాయి తన ఉత్తరానికి జవాబు అందుకున్నాడు. అయితే జవాబుగా యిలా ఉత్తరం వస్తుందని అతను కలలో కూడా అనుకోలేదు."

"మరేం వస్తుందనుకున్నాడు నాన్నా!" అనడిగాడు బాబు.

"అది తర్వాత చెప్తాను. అందుకని చాలా ఆశ్చర్యం పోయాడు. "ఇదేమిటీ. యిలామరో ఉత్తరంవచ్చింది. ఒకవేళ తనమీదకోపం గాని వచ్చిందేమిటి?" అని భయపడుతూనే చదువుకున్నాడు. వెంటనే ఆనందంతో మూర్ఛపోయేటంత పనిఅయింది ఆ ఉత్తరాన్ని తన హృదయానికి హత్తుకున్నాడు."

"అందులో ఏముంది నాన్నా?"

"అదేనమ్మా చెప్పబోయేది. అందులో యిలా వుంది: మీ ప్రేమనే అంగీకరించాను, అయితే నాన్నగారితో మాట్లాడి అంగీకారం పొందండి. అని రాసివుంది."

"నాన్నగారితో ఎందుకు నాన్నా మాట్లాడటం?" అని బాబు ప్రశ్నించాడు.

"అదే. పెళ్ళివిషయం మాట్లాడమని అర్థం. దానితో అబ్బాయి ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు. తర్వాత తన తల్లినిపిలిచి విషయమంతా చెప్పి ఆ అమ్మానాన్నతో సంప్రతింపులు జరపమని పంపించాడు" అని ఒక్క క్షణం ఆగాను.

"తర్వాత ఏమయిందీ?" అని అడిగింది సుధ.

"ఏమవుతుంది. ఆయనకూడా యీ పెళ్ళి యిష్టమేనన్నాడు. త్వరలోనే ముహూర్తం నిశ్చయింపబడేటట్లు చేసి ఆ పెళ్ళి చేసినాడు."

"అయిపోయిందా నాన్నా కథ!"

"ఆఁ ఒక్క విషయం మినహా."

బాబు మొహం అదోవిధంగా పెట్టాడు. "ఇదేమిటీ? ఏమీబాగాలేదు కథ!" అన్నాడు మెల్లిగా.

"ఆ ఒక్క విషయం ఏమిటి నాన్నా" అంటూ ప్రశ్నించింది సుధ.

నేను గొంతు సవరించుకుని యిలాగచెప్పాను: "అసలా అబ్బాయి యిలాగ సంభవిస్తుందని ఎప్పటికీ అనుకోలేదు. అతను ఉత్తరంలో తన ప్రేమ విషయం రాయనేలేదు. అటువంటప్పుడు యిలా గమ్మత్తు జరుగుతుందని ఎలా నమ్మగలడు?"

"అసలా ఉత్తరంలో ఏముందో చెప్పవేం నాన్నా" అని సుధ విసుక్కున్నది.

"ఏమీలేదు. " ఫిజిక్సు నోట్సు దయచేసి ఒకసారి యిస్తారా?" అని రాశాడు. అంటే కాలేజీకి సంబంధించిన పుస్తకం అన్నమాట. దాన్నే మీ అమ్మాయి చూడకుండా అపార్థంచేసుకుని మరో విధంగా జవాబిచ్చింది" అన్నాను.

బాబుకేమీ అర్థమయినట్లు లేదు. "ఏం కథ యిది? ఛీఛీ!" అంటూ వెనక్కి వాలాడు.

అమ్మాయిమాత్రం పాయింటు అర్థం చేసుకున్నది. "అసలు వాళ్లెవరు నాన్నా?" అనడిగింది.

"అమ్మయ్యో. ఆ రహస్యం చెప్పెయ్యటమే. మీ అమ్మకు కోపం వస్తుంది" అన్నాను వెన్నెల వెలుగులో ఉష ముఖాన్ని చూస్తూ. ఆవిడ పెదవులపై చిరునవ్వు నాట్యమాడింది.

వాళ్లెవరో చెప్తే అమ్మకు ఎందుకు కోపం వస్తుందో సుధకు అర్థం అవనేలేదు.